
కమాండర్ షాడో
MVS
PUBLICATIONS
మధుబాబు

# కమాండర్ షాడో

(షాడో స్పై థ్రిల్లర్)

రచన:

మధుబాబు

© Author

© Madhu Baabu

*This digital book is published by -*

కినిగె డిజిటల్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్.

సర్వ హక్కులూ రక్షించబడ్డాయి

*All rights reserved.*

*No part of this publication may be reproduced, stored in a retrieval system or transmitted in any form or by any means electronic, mechanical, photocopying, recording or otherwise, without the prior written permission of the author. Violators risk criminal prosecution, imprisonment and or severe penalties.*

# కమాండర్ షాడో

బుస్సుమని లేచిందా పాము.

పది అడుగుల పొడవు వుంది. శరీరమంతా తామరాకుల మాదిరి నల్లటి డిజైన్‌తో నిండి వుంది. ఎర్రటి కళ్ళను మరింత ఎరుపు చేసి, తోకమీద లేచి నిలబడింది.

బుస కొట్టినప్పుడు వట్టి శబ్దమే కాదు, గోధుమరంగుతో పొగ వెలువడినట్లు వెలుపలికి వస్తోంది విషం.

ఆ పొగ శరీరానికి తగిలితే కుష్టువ్యాధి వస్తుంది. కంటి మీదికి వస్తే క్షణాలమీద అంధులవుతారు.

ఆ పాము కాటువేస్తే ఇక బ్రతకటం అంటూ వుండదు. బ్రహ్మపుత్రానదికి అటూ ఇటూ వున్న కీకారణ్యాలలో కనిపిస్తుందది. అరణ్యంలో అడుగుపెట్టి అజాగ్రత్త గా వుంటే ఎక్కడో ఒకచోట దాని బారిన పడక తప్పదు.

మరోసారి భయంకరంగా బుస కొట్టింది ఆ పాము. విషపు తెరలు ఆరు అడుగుల ముందుకు విరచిమ్మబడ్డాయి.

సరిగ్గా ఆరు అడుగులపైన నాలుగైదుఅంగుళాలు అవతల నిలబడివున్నాడు షాడో.

ఆ పామును చూడగానే హేండ్ కర్చీఫ్‌ని ముఖానికి అడ్డుపెట్టుకొని, కను చివరలనుంచి దాన్నే గమనిస్తున్నాడు.

పాము వెనుక పెద్ద పొద వుంది. ఆ పొదలో ఏదో పుట్ట వున్నట్లు అస్పష్టంగా కనిపిస్తోంది.

ఆకలిమీద వున్నదది, అప్పుడే వేటకు బయలుదేరినట్టుంది. ఆ సమయంలో మంచి కోపంమీద వుంటుంది. ఎదురుపడిన మనిషిని అంత తేలికగా వదలదు.

రివాల్వర్ మీద చేయివేశాడు షాడో. ఆ కదలిక పాముకు కనిపించింది. సుడిగాలికి వూగిన మర్రివూడలా వెర్రిగా వూగుతూ కోపాన్ని మరింతగా పెంచుకున్నది.

దాన్ని చంపాలి. వేరే దారిలేదు. చంపకపోతే తనను చంపిగాని అది నిద్రపోదు.

అయినా రివాల్వర్‌ని బయటకు లాగటానికి తటపటాయించాడు షాడో.

ఆ ప్రదేశానికి కొంచెం అవతలగా... వందగజాల దూరంలో బ్రహ్మపుత్రానది ప్రవహిస్తోంది.

నది ఒడ్డున ఒక చిన్న డింగీ ఆగివుంది. ఆ డింగీలో నలుగురు వ్యక్తులు కూర్చుని వున్నారు.

దూరం నుంచి బైనాక్యులర్ ద్వారా వారిని గమనించాడు షాడో. వారి వేషభాషలు... కొంచెం మొరటుగా వున్నాయి.

దగ్గరకు పోయి వారిని గురించి పూర్తిగా తెలుసుకుందామని వస్తున్నాడు. దారిలోనే ఎదురయింది ఆ పాము.

రివాల్వర్ పేలిస్తే ఆ శబ్దం డింగీలో వున్నవారికి వినిపిస్తుంది. అది షాడోకు యిష్టంలేదు.

రివాల్వర్ మీదనుంచి కిందికి జరిగి... మెల్లిగా... అతి నెమ్మదిగా కుడికాలి మీదకి వచ్చింది షాడో కుడిచేయి.

డాగర్ కుడికాలి బూటులోవుంది. దాన్ని అందుకునేలోగా ఆ పాము వున్న చోటనుంచి కదలకూడదు. అది మరో అడుగు ముందుకు వస్తే తన పని అయిపోయినట్లే.

ఎంత జాగ్రత్త గా కదిలించినా... షాడో ప్రయత్నాన్ని పసికట్టేసిందా పాము. దాని తిక్క తారాస్థాయికి చేరుకున్నది.

ఒక్కసారిగా తట్టెడు విషాన్ని వెలిగ్రక్కి ముందుకు దూకింది.

డాగర్‌ని అందుకునే వ్యవధి లేక ఎగిరి పక్కకు దూకాడు షాడో. విషపు తెరలు అతని పాంటుకు తగిలాయి. ఆకుపచ్చ రంగు పాంటు... విషపు తెరలు తగిలినంతవరకూ నలుపు రంగు పాంటుగా మారిపోయింది.

షాడో తొడలు మంటలు పుట్టడం ప్రారంభించాయి.

చుట్టలు చుట్టుకుంటూ పక్కకు తిరిగింది ఆ పాము. మరుక్షణం చేతిని విసిరాడు షాడో. పాముకంటే వేగంగా కదిలింది అతని కుడిచేయి. దాని తలను వడిసిపట్టుకుంది.

అలాగే దాన్ని కిందకి వంచి బూటుకింద చేర్చి తొక్కి పట్టాడు. తళతళ మెరుస్తున్న డాగర్‌ని బయటికి లాగి ఒకే ఒక వేటుతో తలను తెగకోశాడు.

ఎగిరిపడింది దాని శరీరం. గాలిలో మూడు అడుగుల ఎత్తుకు లేచింది. తోకతో నేలను బాదింది.

దాని తోక దెబ్బకు షాడో చేతులమీద నల్లటిదద్దుర్లు ప్రత్యక్షం అయ్యాయి.

ఆలస్యం చేస్తే చర్మంలోనుంచి ఆ విషం రక్తనాళాల్లోకి పోతుంది. వెంటనే లేచాడు షాడో. అక్కడవున్న పొదలనన్నిటినీ గాలించాడు.

ప్రకృతి అతి విచిత్రమైనది. ప్రాణాలు తీసే ప్రమాదాలను సృష్టిస్తుంది. వాటి పక్కనే అందుకు విరుగుడు కూడా వుంటుంది.

పాము పుట్టవున్న పొదకు నాలుగు అడుగుల ఇవతలగా మూరెడు ఎత్తున్న పిచ్చిచెట్లు వున్నాయి.

పిచ్చిచెట్లు అవి. ఎందుకూ పనికిరానివని అనుకుంటారు అందరూ. కాని ఆ ఆకులపసరు పూస్తే కాలకూట విషమైనా కిందకి దిగిపోతుంది. ఆ సంగతి అందరికీ తెలియదు. ఒక్క అడవుల్లో తిరిగేవారికి తప్ప.

పాంటు షర్టు వూడదీసి నగ్నంగా నిలబడ్డాడు షాడో. తొడలమీద బెత్తెడు వెడల్పయిన బొబ్బలు ప్రత్యక్షమయివున్నాయి.

ఆ చెట్ల ఆకులు తుంచి అరిచేతుల్లో నలిపి పసరుతీశాడు. ఆ పసరును వంటికి పట్టించుకొని నాలుగు ఆకులను నమిలి మింగాడు. తొడలమీద నాలుగు ఆకుల్ని పెట్టి హేండ్ కర్చిఫ్‌ని చించి కట్టుకున్నాడు.

బాధ ఉపశమించింది వెంటనే. బొబ్బలు, దద్దుర్లు తగ్గటానికి నాలుగు గంటల వ్యవధి కావాలి.

బట్టలు వేసుకుంటే ఆ బొబ్బలు పగులుతాయి. లేనిపోని తలనెప్పులు ఎదురౌతాయి.

డ్రాయర్ మాత్రం వుంచుకొని మిగిలిన దుస్తుల నన్నిటినీ ఒక చెట్టుక్రింద దాచాడు.

డాగర్‌ని బిగించి పట్టుకొని నది వైపు అడుగులు వేశాడు. ఆ సమయంలో షాడోని చూసినవారు... అతను ఆరితేరిన సి.బి.ఐ. ఏజంట్ అని అనుకోరు. అతనికి ప్రపంచంలో వున్న భాషల్లో మూడువంతులు వచ్చనీ, భారతదేశంలో రెండువందల చిల్లరభాషలన్నీ మంచినీళ్ళ ప్రాయమనీ వూహించలేరు.

కండలు తిరిగిన అతని ఆరు అడుగుల శరీరం... ప్రపంచంలో వున్న అత్యాధునికమైన పోరాట విధానాలను అన్నిటినీ అభ్యసించింది అతనే అని అనుకోరు.

అడవి మనిషిలా కనిపిస్తున్నాడు షాడో. అడవి మనిషి లాగానే ఆరు అంగుళాల డాగర్‌ని పట్టుకొని, పొదల మధ్యగా నదీతీరాన్ని సమీపించాడు.

ఒక చెట్టుచాటున మోకరించి కూర్చొని ముందుకు చూశాడు.

డింగీ నది ఒడ్డునవున్న ఒక చెట్టుకు కట్టివుంది. అందులో ప్రయాణిస్తున్న మొరటు మనుష్యులు నలుగురూ ఒడ్డుమీద చిన్న మంట వేసి ఏవో దుంపల్ని కాల్చుకుంటున్నారు.

మాటువేసిన పెద్దపులిలా... నిశ్శబ్దంగా ముందుకు జరిగాడు షాడో. వారి మాటలు వినవచ్చే దూరంలోకి పోయి ఆగాడు.

మంటను చల్లార్చి దుంపలను నములుతూ మాట్లాడుకుంటున్నారు వారు. కొన్ని మాటలు షాడోకి అర్థం అవుతున్నాయి. కొన్ని అర్థంకావడంలేదు.

"నన్నడిగితే... యీ పని చాలా కష్టమని అంటాను. రోడ్డుమీద జనసంచారం జాస్తీగావుంటున్నది. ఏదైనాపొరపాటు జరిగితే మన పని ఖాళీ అవుతుంది."

షాడోకి దగ్గిరగా వున్న వ్యక్తి ఒకడు గొణిగాడు. ఒక దుంపను సగం తిని... మిగిలిన సగాన్ని నదిలోకి విసిరి చేతులు దులుపుకున్నాడు మరొక వ్యక్తి.

మిగిలిన వారు అతన్ని చూస్తున్న విధానాన్నిబట్టి ఆ పార్టీకి అతను నాయకుడిలాంటి వాడని గ్రహించాడు షాడో.

"ప్రమాదమో కాదో మనకు అనవసరం. బేలూభాయ్ చెప్పినట్లు చేయడం మన కర్తవ్యం ఇటువంటి ప్రమాదాలు అతనికి ఒక లెక్కలోకి రావు. ఇంతకంటే పెద్దపెద్ద పనులే చేశాడు అతను" అన్నాడా వ్యక్తి.

బేలూభాయ్!

ఉలిక్కిపడ్డాడు షాడో. ఆ పేరు చాలా సుపరిచితంగా వుంది. ఈ బేలూ... డాకూ బేలూసింగ్ కాదుగదా!

షాడో అరిచేతులు చెమటలుపట్టి డాగర్ జారిపోయేంత పని అయింది. మెల్లిగా లేచి డింగీ ఎక్కుతున్నారు ఆ వ్యక్తులు. షాడో కళ్ళు అప్రయత్నంగా వారిని గమనిస్తూ వున్నాయి. అతని మనస్సు మాత్రం మరో లోకంలోకి వెళ్ళిపోయింది.

పది సంవత్సరాల క్రితం... యిప్పుడు కాదు... అప్పటికి తను ఇంత ఆరితేరిన మనిషి కాదు... దొంగగా మారిన కొత్తలో.

డాకూ బేలూసింగ్ ఉత్తరభారతదేశాన్ని ఒక వూపు వూపి చూస్తున్న రోజులు.

మనుషుల్ని చంపటం అంటే బేలూసింగ్ కి మహా సరదా.. దారులు కాచి బస్సులను, ట్రైనులనూ ఆపి కొల్లగొట్టేవాడు. ఎదురైన ప్రతిమనిషినీ చంపిగానీ పారిపోయేవాడు కాదు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=591**